సాక్షి
పశ్చిమగోదావరి
శుక్రవారం । 12 । సెప్టెంబర్ । 2025




ఆక్వా వహ్వా..!

రైతులకు సిరులు అందించే కల్పతరువు ఆక్వా సాగు నీరు, నేల యాజమాన్య పద్ధతులపై ఆధారపడి ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. 8లో ▸



వరిని ఆశిసున్న పురుగులు

కాండం తొలుచు పురుగు, ఆకునల్లి తదితర రకాల పురుగులతో వరి సాగుకు తీవ్ర నష్టం ఏర్పడుతుండడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 8లో ▸



పెరిగిన వర్జీనియా ధర

చాలా రోజులు స్థిరంగా కొనసాగిన వర్జీనియా పొగాకు ధర ఈ నెల ప్రారంభం నుంచి పెరుగుతూ వచ్చింది. గురువారం కేజీ ధర రూ. 395కు చేరుకుంది. 8లో ▸



కలానికి సంకెళ్లా?



ప్రెస్‌మీట్‌లలో ప్రజాప్రతినిధులు మాట్లాడిన మాటలను కథనంగా ప్రచురిస్తే కూడా ఆ విలేకరుల నుంచి పైస్థాయి వరకు పాత్రికేయ రంగంపై కేసులు పెట్టడం ఎప్పుడూ చూడలేదు. సమాజంలో నాలుగో స్తంభంగా వర్ణించే పాత్రికేయ రంగంపై ఇలాంటి చర్యలు తీసుకోవడం బాధాకరం. సమాజంలో ఉన్న లోటుపాట్లను ఎత్తిచూపే పాత్రికేయులపై ఆంక్షలు విధించడం, భయపెట్టే ధోరణిని ఏ ప్రభుత్వం **కూడా ఆచరించకూడదు. కూటమి ప్రభుత్వం ఇదే కొనసాగిస్తే ప్రజా ఉద్యమం తప్పదు.**

– కారుమూరి వెంకట నాగేశ్వరరావు, మాజీ మంత్రి

ఆఫ్ఘనిస్తాన్‌లో ఉన్నామా.. ఏపీలో ఉన్నామా..



పత్రికా స్వేచ్ఛ పరిరక్షణ విషయంలో ఆఫ్ఘనిస్తాన్‌లో ఉన్నామా.. ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నామా అనే విషయం అర్థం కావడం లేదు. పత్రికా స్వేచ్ఛను హరించడం నీతిమాలిన చర్య. భావ ప్రకటనా స్వేచ్ఛ కాలరాసే హక్కు ఎవరికీ లేదు. ప్రజాస్వామ్యంలో నాలుగో స్తంభంగా ఉన్న పాత్రికేయ వ్యవస్థకు సమాజంలో జరుగుతున్న విషయాలను తెలియజేసే హక్కు ఉంది. వీటిపై పాలక పక్షాలు వివరణలు ఇవ్వాలి **తప్ప స్టేట్‌మెంట్లను ప్రచురిస్తే కేసులు నమోదు చేయడం కక్ష సాధింపే. అందరూ ఖండించాలి.**

– కొట్టు సత్యనారాయణ, మాజీ డిప్యూటీ సీఎం

అమృత్‌పై నీలినీడలు

కూటమి అలసత్వం

- జిల్లాలో ఆరు పట్టణాలకు సంబంధించి మంచినీటి సరఫరా ప్రాజెక్టు
- డీపీఆర్‌లు సిద్ధం చేసిన గత ప్రభుత్వం
- టెండర్ల దశలో సార్వత్రిక ఎన్నికలు
- 15 నెలలుగా కూటమి హయాంలో పట్టాలు ఎక్కని ప్రాజెక్టు పనులు



భీమవరం పట్టణ వ్యూ

భీమవరం(ప్రకాశం చౌక్): పశ్చిమగోదావరి జిల్లాలోని ఆరు పట్టణాలకు సురక్షిత తాగునీటిని పుష్కలంగా అందించే అమృత్ 2.0 (అటల్ మిషన్ ఫర్ రిజువెనేషన్ అండ్ అర్బన్ ట్రాన్స్‌ఫర్మేషన్) మంచినీటి సరఫరా ప్రాజెక్టు ముందుకు కదలడం లేదు. జిల్లాలోని భీమవరం, పాలకొల్లు, తణుకు, తాడేపల్లిగూడెం, నరసాపురం, ఆకివీడు మున్సిపాలిటీల్లో శివారు ప్రాంతాలకు సైతం రెండు పూటలా మంచినీటిని అందించి శాశ్వతంగా తాగునీటి సమస్య లేకుండా చేసే బృహత్తర ప్రాజెక్టు పనులు నత్తనడక కంటే దారుణంగా సాగుతున్నాయి. మొదట అమృత్ 2.0 ప్రాజెక్టుకు రూ.286.54 కోట్లు మంజూరు చేయగా 2025 నాటికి పూర్తి చేయాలని నిర్దేశించారు. దీంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమృత్ 2.0 ప్రాజెక్టుపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి ప్రాజెక్టుకు సంబంధించి డీపీఆర్‌లు సైతం పూర్తి చేసి టెండర్లు ప్రక్రియ వరకు తీసుకువెళ్లింది. అనంతరం సార్వత్రిక ఎన్నికలు రావడం, ప్రభుత్వం మారిపోవడంతో ప్రాజెక్టు పనులు నిలిచిపోయాయి. ఆ తరువాత కేంద్ర ప్రభుత్వం మళ్లీ ప్రాజెక్టు వ్యయం రూ.770.85 కోట్లతో భారీ ప్రాజెక్టుగా మార్చింది.

15 నెలలుగా ముందుకు కదలడం లేదు

పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్ ద్వారా జరిగే ఈ ప్రాజెక్టుకు కూటమి ప్రభుత్వం నుంచి పూర్తి సహాయ సహకారం అందడం లేదని స్పష్టంగా తెలుస్తోంది. గత 15 నెలలుగా ఒక పనికి కూడా టెండర్ వరకు అమృత్ 2.0 ముందుకు వెళ్లలేదు. ఆరు పట్టణాల్లో ఎక్కడ కూడా ఇప్పటివరకు ఒక పనికి కూడా టెండర్లు ఖరారు కాలేదు. పూర్తిగా డీపీఆర్‌లు కూడా తయారీ కాలేదు. జిల్లాలో ముఖ్యమైన పట్టణాలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వ అధ్వర్యంలో చేపట్టాల్సిన మంచినీటి ప్రాజెక్టు గురించి కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. దీంతో పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ శాఖ అధికారులు సైతం ప్రభుత్వ బాటలోనే పయనిస్తూ ప్రాజెక్టు పనులపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.

టెండర్లకు చర్యలు

> అమృత్ 2.0 ప్రాజెక్టుకు సంబంధించి మారిన షెడ్యూల్ రేట్ల ప్రకారం డీపీఆర్‌లు సిద్ధం చేసి టెండర్లకు చర్యలు తీసుకుంటున్నాం.
>
> – ఆర్.విజయ్
>
> **జిల్లా పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ శాఖ అధికారి**

దృష్టి సారించని కేంద్ర మంత్రి

జిల్లా కేంద్రమైన భీమవరంలో కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ ఉన్నా కేంద్ర ప్రాజెక్టు అమృత్ 2.0పై శ్రద్ధ వహించడం లేదు. ప్రజలకు తాగునీరు అందించే ప్రాజెక్టుపై శ్రద్ధ చూపడం లేదనే విమర్శలు ఉన్నాయి.

ఇప్పటివరకు జిల్లాలోని ఆరు పట్టణాలకు సంబంధించిన ఏ ఎమ్మెల్యే గానీ, రాష్ట్ర మంత్రి నిమ్మల రామనాయుడు గానీ అమృత్ 2.0 గురించి అధికారులను కనీసం ఆరా తీసిన దాఖలా లేదంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఇప్పటికే ఆయా పట్టణాల్లో చివరి ప్రాంతాల ప్రజలు మంచినీళ్ల కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పట్టణాల్లో రోజురోజుకూ పెరుగుతున్న జనాభా, అలాగే కొన్ని మున్సిపాలిటిల్లో విలీన గ్రామాలు కూడా భవిష్యత్‌లో కలిసే అవకాశం ఉన్న నేపథ్యంలో పెరిగే జనాభా దృష్టిలో పెట్టుకుని ప్రాజెక్టు వేగవంతం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ప్రాజెక్టు నిధులు, పనులు పట్టణాల వారీగా..

అమృత్ 2.0 ప్రాజెక్టు నిధులు ఆరు పట్టణాలకు రూ. 770.85 కోట్లు కాగా అందులో ముఖ్యమైన పనుల్లో విజ్జేశ్వరం నుంచి ఆరు పట్టణాలకు వాటర్ గ్రిడ్ పైపులైన్, మొత్తం 12 ఓహెచ్‌ఆర్‌లు (వాటర్ ట్యాంకులు), ఎస్‌టీపీలు 2 (మురికి నీళ్లు శుద్ధిచేసే ప్లాంట్లు), ఫిల్టరేషన్ ప్లాంట్లు 3, సమ్మర్ స్టోరేజీ ట్యాంకు, అండర్ గ్రౌండ్ డ్రైయినేజీ పనులు ఉన్నాయి.

భీమవరం రూ.167.72 కోట్లు
విజ్జేశ్వరం నుంచి 54 కిలోమీటర్లు మేర వాటర్ గ్రిడ్‌ద్వారా పైపులైన్‌వేయడం, పట్టణంలో మంచినీటి సరఫరా కోసం పైపులైన్లు, ఇతర వాటర్ సరఫరా పనులు.

తాడేపల్లిగూడెం రూ.163.50 కోట్లు
సమ్మర్ స్టోరేజి ట్యాంకు, ఓహెచ్‌ఆర్ 1, ఎస్‌టీపీలు 2, అండర్ గ్రౌండ్ డ్రైయినేజీ, పైపులైను పనులు

నరసాపురం రూ.125.92 కోట్లు
ఓహెచ్‌ఆర్‌లు 3, ఫిల్టరేషన్ ప్లాంట్ 1, సంపులు, పైపులైన్ల పనులు

పాలకొల్లు రూ.119.26 కోట్లు
వాటర్ పైపులైన్లు, ఇతర వాటర్ సరఫరా పనులు

తణుకు రూ 118.119 కోట్లు
ఓహెచ్‌ఆర్‌లు 4,
ఫిల్టరేషన్ ప్లాంట్ 1, పైపులైన్ల పనులు

ఆకివీడు రూ.76.34 కోట్లు
ఓహెచ్‌ఆర్‌లు 4, ఫిల్టరేషన్ ప్లాంట్ 1, పైపులైన్ల పనులు

సమస్యలు పరిష్కరించకుంటే రాష్ట్రవ్యాప్త నిరసనలు

సచివాలయ ఉద్యోగుల హెచ్చరిక



యలమంచిలిలో ఈఓపీఆర్డీకి వినతిపత్రం ఇస్తున్న సచివాలయ ఉద్యోగులు

యలమంచిలి: గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సమస్యలను 15 రోజుల్లో పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడతామని ఆంధ్రప్రదేశ్ గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల ఐక్యవేదిక స్పష్టం చేసింది. రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు గురువారం రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి మున్సిపాలిటీలో, మండలంలో మున్సిపల్ కమిషనర్లకు, ఎంపీడీఓలకు సచివాలయ ఉద్యోగులు అధికారిక నోటీసులు అందజేశారు. ఈ మేరకు యలమంచిలి మండల ఉద్యోగులు ఈఓపీఆర్డీ జేడీవీ ప్రసాద్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఇంటింటికీ తిరుగుతూ చేసే సర్వేల నుంచి సచివాలయ ఉద్యోగులకు విముక్తి కల్పించాలని, గ్రామ/వార్డు సచివాలయ ఉద్యోగులను వారి సంబంధిత మాతృశాఖలకే అనుసంధానం చేయాలని, సమయపాలన లేకుండా ఆదివారాలు, పండుగలు, సెలవులు, అర్ధ రాత్రుల్లో బలవంతపు విధులు చేయించడం నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ప్రొబేషన్ పీరియడ్ పూర్తయిన వారికి నోషనల్ ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలని, ఆరేళ్లుగా ఒకే క్యాడర్‌లో కొనసాగుతున్న వారికి స్పెషల్ ఇంక్రిమెంట్ ఇవ్వాలని, ప్రస్తుత రికార్డ్ అసిస్టెంట్ క్యాడర్‌ను జూనియర్ అసిస్టెంట్ క్యాడర్‌గా మార్పు చేయాలని, జిల్లాల వారీగా సీనియారిటీ జాబితాలు విడుదల చేయాలని, స్టేషన్ సీనియారిటీ ఆధారంగా పారదర్శక బదిలీలకు ప్రత్యేక విధి విధానాలు రూపొందించాలని వారు అధికారిక నోటీసులో పేర్కొన్నారు.

ఉపాధ్యాయుల పోరుబాట




కాళ్ల మండలం ఎల్ఎన్ పురంలో నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరైన ఉపాధ్యాయులు

భీమవరం: తమ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వ మొండివైఖరిని నిరసిస్తూ ఉపాధ్యాయులు పోరుబాట పట్టారు. జిల్లాలోని ఉపాధ్యాయులంతా గురువారం నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. పెండింగ్‌లో ఉన్న 4 డీఏలను తక్షణం విడుదల చేయాలని, 12వ పీఆర్సీ కమిషన్ నియమించి ఐఆర్ ప్రకటించాలని, అన్ని రకాల బకాయిలు చెల్లించాలని, ఈహెచ్ఎస్ పరిమితిని రూ.25 లక్షలకు పెంచాలని, యాప్‌లు, అసెస్మెంట్ బుక్‌లెట్ విధానాలను రద్దుచేయాలని డిమాండ్ చేశారు. వారం రోజుల పాటు నిరసన కార్యక్రమాలకు ప్రణాళిక రూపొందించినట్లు ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు జి.ప్రకాశం తెలిపారు. ఈనెల 12న మండల కేంద్రాల్లో నిరసన ప్రదర్శనలు, 13, 14 తేదీల్లో ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు అందించడం, 15న తాలూకా కేంద్రాల్లో, 16న జిల్లా కేంద్రాల్లో నిరసన ప్రదర్శనలు, 17న ముఖ్యమంత్రి, సీఎస్‌లకు వాట్సాప్, ఈ మెయిల్ ద్వారా వినతులు పంపించి నిరసనలు తెలుపుతామని, అప్పటికీ ప్రభుత్వం సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని చెప్పారు.

కర్నూలు ఉల్లి.. రైతులు తల్లడిల్లి

- గిట్టుబాటు ధర లేని వైనం
- నాణ్యతలేమి, తేమ శాతంతో ఇబ్బందులు
- ఆదుకోని కూటమి సర్కారు
- నలిగిపోతున్న ఉల్లి రైతులు



రోడ్లపై పడేస్తున్న కర్నూలు రకం ఉల్లిపాయలు

తాడేపల్లిగూడెం: ఆరుగాలం కష్టించి పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక కర్నూలు ఉల్లి రైతులు తల్లడిల్లుతున్నారు. రాష్ట్రంలోనే ప్రధానమైన తాడేపల్లిగూడెం మార్కెట్‌కు కర్నూలు ఉల్లి లారీలు వస్తున్నా తేమశాతం, నాణ్యత లేమితో వ్యాపారులు కొనుగోలు చేయకపోవడంతో ఏం చేయాలో పాలుపోక అల్లాడుతున్నారు. ప్రభుత్వ సాయం అందక, అధికారులు చేస్తున్న ప్రయత్నాలు ఫలించకపోవడంతో నెల రోజులుగా రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ఉల్లి బస్తాలను రోడ్ల పక్కన వదిలేస్తూ నిట్టూరుస్తున్నారు.

70 ఏళ్లుగా ఇక్కడికే.. రాష్ట్రంలోని ఉల్లి అవసరాన్ని మహారాష్ట్ర ఉల్లి తర్వాత కర్నూలు, కడప ఉల్లి తీరుస్తుంది. ఖరీఫ్, రబీ సీజన్లలో వేలాది ఎకరాల్లో ఉల్లి పండించడంతో పాటు అధిక శాతం పంటను 70 ఏళ్లుగా ప్రధాన మార్కెట్‌గా ఉన్న తాడేపల్లిగూడెనికి రైతులు తీసుకొస్తున్నారు. ఇక్కడ బస్తా బస్తా గ్రేడింగ్ చేసి ధర నిర్ణయిస్తారు. బహిరంగ వేలంలో ఉల్లిని విక్రయిస్తారు. అదే రోజు రైతుల చేతికి సొమ్ములు అందుతాయి. కర్నూలు మార్కెట్ దీనికి భిన్నం కావడంతో ఈ రకం గూడెం మార్కెట్‌కే ఎక్కువగా వస్తుంది. ఇది చాలా కాలంగా వ్యాపార బంధంగా కొనసాగుతోంది. అక్కడి ఉల్లి రైతులకు కష్టం వచ్చినా కూడా ఆదుకొనేది తాడేపల్లిగూడెం వ్యాపారులే కావడం విశేషం.

విస్తీర్ణం తగ్గినా.. ధర లేదు

కర్నూలు జిల్లాలో ఉల్లి సాగు విస్తీర్ణం క్రమేపీ తగ్గుతోంది. 2019–20లో 33,829 ఎకరాల్లో సాగు చేయగా 7.78 లక్షల టన్నుల దిగుబడి వచ్చింది. అదే 2024–25లో 19,546 ఎకరాల్లో సాగు చేయగా 3.51 లక్షల టన్నులకు దిగుబడి అంచనా వేశారు. ఎకరాకు రైతుకు రూ.70 వేలు ఖర్చవుతుంది. కనీస దిగుబడి 50 క్వింటాళ్లు రావాలి. అలాగే ధర క్వింటాలు రూ.2 వేలు పలికితేనే రైతు గట్టెక్కుతారు. అయితే ఈ ఏడాది ధరలు దారుణంగా పడిపోయాయి. కిలోకు రూ.4 రావడం గగనంగా మారింది. నాణ్యత ఉంటే రూ.9 వరకు వస్తుంది. కిలో గరిష్ట ధరను రూ.11గా నిర్ణయించారు. దీంతో రైతులు ఉల్లిని మార్కెట్లకు తెస్తున్నారు. వాటిని మార్క్‌ఫెడ్ కొనుగోలు చేసి తర్వాత ప్రధాన మార్కెట్‌కు పంపిస్తోంది.

వ్యాపారులు కొనడం లేదు

> తాడేపల్లిగూడెం మార్కెట్‌కు వచ్చే కర్నూలు ఉల్లిలో నాణ్యత లేకపోవడంతో వ్యాపారులు కొనడం లేదు. ఇంకా మహారాష్ట్ర ఉల్లిపాయలు వస్తున్నాయి. మహారాష్ట్రలో కూడా 60 శాతం పంట ఉంది. సాధారణంగా కర్నూలు ఉల్లి సీజన్‌లో రోజుకు 80కు పైగా లారీలు గూడెం మార్కెట్ వస్తుంటాయి. అయితే ప్రస్తుతం ఏడెనిమిది లారీలు మాత్రమే వస్తున్నాయి. కడప, మైదుకూరు ప్రాంతాల నుంచి వచ్చే రకంలో కాస్త నాణ్యత ఉంటుండగా.. కర్నూలు రకం ఇక్కడకు వచ్చేసరికి కుళ్లిపోతున్నాయి. దీంతో కిలో రూ. 2 కు కూడా కొనడం లేదు. వాటిని దుకాణాల్లో ఉంచుకోలేం. దీంతో వ్యాపారులు తాము తీసుకునే కమీషన్ సొమ్ములను రైతుల నుంచి తీసుకోవడం లేదు. ప్రభుత్వం ఆదేశాల మేరకు కర్నూలు ఉల్లి రైతులకు న్యాయం చేయడానికి మా వంతు కృషి చేస్తున్నాం. **– ఎన్వోకే, ఉల్లి వ్యాపారి**

నాలుగు రోజుల తర్వాత గూడెంకు..

మహారాష్ట్ర ఉల్లితో పోలిస్తే కర్నూలు ఉల్లిలో నాణ్యత తక్కువ. మార్క్‌ఫెడ్ కొనుగోలు చేసిన వెంటనే పంటను మార్కెట్లు తరలించాల్సి ఉండగా అలా జరగడం లేదు. ఉల్లిని కర్నూలు మార్కెట్ యార్డులో కొనుగోలు చేసి, నెట్లు కట్టి నాలుగు రోజుల తర్వాత తాడేపల్లి గూడెం మార్కెట్‌కు పంపిస్తున్నాయి. వాస్తవానికి ఉల్లి లారీ 30 నుంచి 35 టన్నులు ఉంటుంది. నాసిరకం, కుళ్లిపోయే గుణం కర్నూలు ఉల్లిని పది టన్నులకు మించి పంపకూడదు. సామర్థ్యానికి మించి పంపితే ఆవిరి పెరిగి, పై బస్తాలు కింద బస్తాలను నొక్కడంతో ఉల్లిపాయలు మరింత రసం కారేలా తయారవుతున్నాయి. దీంతో ఈ రకం మార్కెట్‌కు వచ్చినా ఎవరూ కొనుగోలు చేయకపోవడంతో రోడ్లపై పడేసే పరిస్థితి వచ్చింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ధరల స్థిరీకరణ పేరుతో ఏటా రూ.3 వేల కోట్లను బడ్జెట్‌లో కేటాయించి రైతులకు పంటల విషయంలో సమస్య వచ్చినప్పుడు కనీస ధర ఇచ్చి ఆదుకునేది. ప్రస్తుత కూటమి పాలనలో ఈ పరిస్థితి లేకపోవడంతో రైతులు అల్లాడుతున్నారు.

అటవీ అమరవీరులకు నివాళి



అటవీ అమరవీరులకు నివాళి అర్పిస్తున్న దృశ్యం

భీమవరం: అటవీ, వన్యప్రాణి సంరక్షణ కోసం అశువులు బాసిన అమరవీరులను స్ఫూర్తిగా తీసుకుని అటవీ సిబ్బంది నిబద్ధతతో పనిచేయాలని జిల్లా అటవీశాఖాధికారి డీఏ కిరణ్ అన్నారు. గురువారం జిల్లా అటవీ శాఖాధికారి కార్యాలయంలో జాతీయ అటవీ అమరవీరుల సంస్మరణ దినోత్సవం నిర్వహించారు. గంధం చెక్కల స్మగ్లర్ వీరప్పన్ చేతిలో మృతి చెందిన రాజమహేంద్రవరానికి చెందిన ఫారెస్ట్ అధికారి పందిరిపల్లి శ్రీనివాసరావు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. భీమవరం రేంజ్ అటవీ క్షేత్రాధికారి మురాల కరుణాకర్ మాట్లాడుతూ 1730 సెప్టెంబర్ 11న రాజస్థాన్ రాష్ట్రం జోదపూర్‌లో అటవీ సంరక్షణకు సుమారు 363 మంది బలిదానం కావడంతో మహారాజా అభయ్ సింగ్ పశ్చాత్తాపంతో అటవీ అమరవీరుల త్యాగాలను గుర్తు చేసుకుంటూ జాతీయ అటవీ సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహించారని చెప్పారు. అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ భారతి, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ సురేష్‌కుమార్, బీట్ ఆఫీసర్ రాంప్రసాద్, సీనియర్ అసిస్టెంట్ పోచమ్మ పాల్గొన్నారు.

బాల్యవివాహాల నిరోధానికి కృషి చేయాలి

ఏలూరు (టూటౌన్): బాల్య వివాహాలు నిరోధించడానికి సమష్టిగా కృషి చేయాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ కోరారు. బాల్యవివాహాల వల్ల కలిగే నష్టాలు, మహిళలపై లైంగిక వేధింపుల నివారణ చట్టాలపై గురువారం ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా న్యాయసేవాధికార సంస్థ భవనంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.రత్నప్రసాదు మాట్లాడుతూ అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు బాల్యవివాహాలను నిరోధించడానికి తమ వంతు కృషి చేయాలన్నారు. పని ప్రదేశాల్లో మహిళలకు ఎదురయ్యే లైంగిక వేధింపులను ధైర్యంగా ఎదుర్కోవాలన్నారు. దీనికి చట్టం ద్వారా ఆయా సంస్థల్లో ఒక కమిటీని ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. ఆ కమిటీ వివరాలను సంబంధిత కార్యాలయాల ముందు ప్రదర్శించాలని తెలియజేశారు.

న్యూస్‌రీల్

ధాన్యం కొనుగోలుకు పటిష్ట కార్యాచరణ



అధికారులతో మాట్లాడుతున్న జేసీ

భీమవరం: ఖరీఫ్ సీజన్ ధాన్యం కొనుగోలుకు పటిష్ట కార్యాచరణ సిద్ధం చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని జాయింట్ కలెక్టర్ ఛాంబర్ నందు ఖరీఫ్ సీజన్లో ధాన్యం కొనుగోలు ఏర్పాట్లపై పౌర సరఫరాలు, వ్యవసాయ, సహకార, రవాణా శాఖలు, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ సభ్యులతో జేసీ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్టోబర్ మొదటి వారం నుంచి రైతుల ధాన్యం కొనుగోలుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మొదటి వారంలో తాడేపల్లిగూడెంలో ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు చేయాలన్నారు.

మద్యం అదనపు ధరలపై నిరసన



మద్యం దుకాణం వద్ద నిరసన

పెనుగొండ: ములపర్రులో మద్యం ధరలను ఇష్టారాజ్యంగా వసూలు చేస్తుండడంపై మద్యం ప్రియులు గురువారం దుకాణం వద్ద నిరసన తెలిపారు. మద్యం ధరలు తగ్గించాలంటూ నినాదాలు చేశారు. సమయానుకూలంగా ధరలు మారుస్తున్నారంటూ విమర్శించారు. అధికంగా ఎందుకు తీసుకుంటున్నారని ప్రశ్నిస్తే ధర ఇంతేనంటూ వెటకారంగా సమాధానం ఇస్తున్నారని వాపోయారు. ధరలు తగ్గించకపోతే పోరాటం చేస్తామని హెచ్చరించారు.

జెడ్పీ పర్యవేక్షక ఇంజనీర్‌గా రమేష్ బాధ్యతల స్వీకరణ

ఏలూరు(మెట్రో): ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పంచాయతీరాజ్ పర్యవేక్షక ఇంజనీర్‌గా రమేష్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం జిల్లా పరిషత్ క్యాంపు కార్యాలయంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీని ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. పంచాయతీ రాజ్ విభాగం ద్వారా జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి పనులపై సమగ్రంగా చర్చించారు.

కర్నూలు ఉల్లినే వినియోగించండి



కర్నూలు ఉల్లిని పరిశీలిస్తున్న కలెక్టర్

తాడేపల్లిగూడెం: రాష్ట్రంలో పండిన కర్నూలు ఉల్లిపాయలను వినియోగించి రైతులకు బాసటగా నిలవాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి పిలుపునిచ్చారు. గురువారం తాడేపల్లిగూడెంలో మార్కెట్‌లో ఉల్లిపాయల క్రయ విక్రయాలను ఆమె పరిశీలించారు. పరిస్థితిపై కలెక్టర్ రైతులను నేరుగా అడిగి తెలుసుకున్నారు. కర్నూలు ఉల్లిపాయలతో వంట చేయించి, వ్యాపారులు, రైతులతో కలిసి కలెక్టర్ అక్కడే భోజనం చేశారు. షోలాపూర్ ఉల్లి కన్నా, కర్నూలు ఉల్లి ఎంతో రుచికరం అని, జిల్లా ప్రజలు, విద్యాసంస్థలు కర్నూలు ఉల్లినే వినియోగించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉల్లి రైతులను ఆదుకొనేందుకు ఎప్పటికప్పుడు సమీక్షిస్తుందన్నారు. గురువారం వచ్చిన ఉల్లిపాయలకు కిలోకు రూ.6 వచ్చాయని రైతు తెలుపగా, కలెక్టర్ కోరిక మేరకు రూ.9 వంతున చెల్లించడానికి వ్యాపారులు అంగీకరించారు. విద్యాసంస్థల్లో, మార్టుల్లో కర్నూలు ఉల్లిపాయల విక్రయాలు చేపట్టడానికి చర్యలు తీసుకున్నట్టు ఆమె చెప్పారు. మార్కెటింగ్ రీజినల్ జేడీ.కె.శ్రీనివాసరావు, ఏడీ సునీల్ కుమార్, తహసీల్దార్ సునీల్, కమిషనర్ ఎం. ఏసుబాబు, తదితరులు ఉన్నారు.

పొంగి ప్రవహిస్తున్న వాగులు

టి.నరసాపురం: మండలంలో బుధవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. దీంతో ఆయా మార్గాల్లో గురువారం వాహన రాకపోకలు నిలిచిపోయాయి. మండలంలోని మక్కినవారిగూడెం – టి.నరసాపురం మార్గంలో కనకదుర్గ గుడి వద్ద జలవాగు, బండివారిగూడెం – మక్కినవారిగూడెం గ్రామాల మధ్య గల ముగ్గురాళ్ళ వాగు, అప్పలరాజుగూడెం – మధ్యాహ్నపువారిగూడెం గ్రామాల మధ్య ఎర్రకాలువ వాగులు భారీ వర్షం కారణంగా పొంగి ప్రవహిస్తున్నాయి. దీంతో ఆయా గ్రామాల మధ్య వాహన రాకపోకలు పూర్తిగా స్తంభించాయి.

క్లుప్తంగా

కడుపు నొప్పి తాళలేక వివాహిత ఆత్మహత్య


మంగమ్మ మృతదేహం

భీమడోలు : భీమడోలు పంచాయతీ పరిధిలోని అర్జావారిగూడేనికి చెందిన ఓ వివాహిత మహిళ కడుపునొప్పి తాళలేక చీరతో ఉరి వేసుకుని గురువారం రాత్రి మృతి చెందింది. అర్జావారిగూడెంకు చెందిన గురజాల మంగమ్మ(50) అనే వివాహిత మహిళ కొంత కాలంగా కడుపు నొప్పితో బాధపడుతుంది. అయితే విపరీతమైన కడుపునొప్పి రావడంతో ఆమె బాధ తట్టుకోలేక ఇంట్లో చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఆమె భర్త ఐదేళ్ల కితం మృతి చెందారు. ఆమె ముగ్గురు పిల్లలకు వివాహాలయ్యాయి. ఆమె కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుంది. ఆమె చిన్న కుమార్తు కుటుంబంతో కలిసి జీవిస్తుంది. భీమడోలు పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. అనుమానస్పద కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వై.సుధాకర్ తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



భీమవరం: పట్టణంలోని ఉండి రైల్వే గేటు సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి మరణించినట్లు భీమవరం టుటౌన్ ఎస్సై కె.రామారావు గురువారం విలేకరులకు తెలిపారు. చనిపోయిన వ్యక్తికి సుమారు 45 ఏళ్ల వయస్సు ఉంటుందని పేర్కొన్నారు. వీఆర్ఓ మహాలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రామారావు తెలిపారు.

మెట్లపై కూర్చుని వ్యక్తి మృతి

ఏలూరు టౌన్: ఏలూరు అమీనాపేట సెయింట్ పాల్స్ లూథరన్ చర్చి ఎదురుగా ఒక ఇంటి ముందు గుర్తు తెలియని వ్యక్తి మెట్లపై కూర్చొని మృతి చెందాడు. స్థానికుల సమాచారంతో ఏలూరు టూటౌన్ పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి వివరాల కోసం ఆరా తీశారు. మృతుని వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని పోలీసులు చెబుతున్నారు. మృతుడు గళ్ళ చొక్కా , పచ్చ రంగు ప్యాంటు ధరించి ఉన్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు సర్వజన ఆసుపత్రి మార్చురీకి తరలించారు. మృతుని వివరాలు తెలిసిన వారు ఏలూరు టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని సీఐ కే.అశోక్‌కుమార్ తెలిపారు.

పాము కాటుతో వ్యక్తి మృతి

లింగపాలెం: మండలంలోని వేములపల్లి గ్రామానికి చెందిన సరిపల్లి ఏసు పాదం (48) గురువారం పాము కాటుతో మరణించాడు. వివరాల ప్రకారం కూలి పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించే ఏసుపాదం గురువారం గ్రామంలో ఆయిల్ పామ్ తోటలో గెలలు కోస్తున్న సమయంలో పాముకాటుకు గురయ్యాడు. గమనించిన తోటి కూలీలు వెంటనే అతడిని చికిత్స నిమిత్తం ఏలూరు ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే అతను మృతి చెందినట్లు ధ్రువీకరించారు. ఈ ఘటనపై విచారణ చేస్తున్నారు.

18న ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా క్రికెట్ జట్టు ఎంపిక

ఏలూరు రూరల్: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అండర్-14 బాలుర క్రికెట్ జట్టును ఈ నెల 18న ఎంపిక చేయనున్నామని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా త్రిసభ్య కమిటీ సభ్యుడు ఎస్‌కె షకీర్‌హుస్సేన్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. భీమవరం డీఎన్ఆర్ కళాశాల ఆవరణలో ఉదయం 9 గంటలకు ఎంపిక ప్రక్రియ ప్రారంభమవుతుందని వెల్లడించారు. ఇందులో పాల్గొనే క్రీడాకారులు 01-09-2011 తర్వాత పుట్టిన వారై ఉండాలని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు సొంత కిట్‌తో పాటు పుట్టినతేదీ ఒరిజినల్ ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు, విద్య ధ్రువపత్రంతో హాజరుకావాలని సూచించారు. మరింత సమాచారం కోసం 70136 33143 నంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు.

నీరు.. నేలతో ఆక్వా వహ్వా..!

- ఆక్వా సాగులో ఆ రెండే కీలకమంటున్న నిపుణులు
- కొల్లేరు నల్లరేగడి నేలలు సాగుకు అనుకూలం


రొయ్యల చెరువులో తిరుగుతున్న ఏరియేటర్లు(ఫైల్)


చేపల పట్టుబడి చేస్తున్న కార్మికులు

కైకలూరు: ఆక్వా సాగు అంటే రైతులకు సిరులు అందించే కల్పతరువుగా భావిస్తారు. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో ఆక్వా సాగు ఎక్కువగా చేస్తారు. అయితే ఇటీవల ఆక్వా సాగులో రైతులు నష్టాలను చవిచూస్తున్నారు. సాగుపై సరైన అవగాహన లేకపోవడంతో ఆర్థికంగా నష్టపోతున్నారు. చేపలు, రొయ్యల పెంపకం నీరు, నేల యాజమాన్య పద్ధతులపై ఆధారపడి ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. చెరువు అడుగున నీటి మధ్య పరస్పర చర్య జరుగుతుంది. నీటి నాణ్యత, ప్లాంక్టాన్ పెరుగుదల పంట దిగుబడిని నేరుగా ప్రభావితం చేస్తోంది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 2.90 లక్షల ఎకరాల్లో ఆక్వా సాగు చేస్తున్నారు. ప్రధానంగా కొల్లేరు ప్రాంతంలో నల్లరేగడి నేలల్లో సాగు ఎక్కువగా జరుగుతోంది. నేల స్వభావం దెబ్బతింటే స్థూల, సూక్ష్మ మూలకాలు పెరిగి పంట ఎదుగుదలపై ప్రభావం చూపుతాయి. నీటి నాణ్యత లోపం వల్ల బ్యాక్టీరియా వృద్ధి చెంది పేను, తాటాకు తెగులు, శంకు జలగ, జిగురు వ్యాధులు వ్యాప్తి చెందుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో నీరు, నేలపై ఆక్వా నిపుణులు తెలిపే సూచనలను ఓ సారి తెలుసుకుందాం.

నీటి నాణ్యతపై శ్రద్ధ అవసరం

మంచి నేల నిర్వహణ ఎంతో ముఖ్యమో సరైన నీటి నాణ్యత పర్యవేక్షణ కూడా అంతే ముఖ్యం. సాగు చేసే చెరువు నీటి ఉష్ణోగ్రతలు 28 డిగ్రీల నుంచి 32 డిగ్రీల సెంటీగ్రేట్ మధ్య ఉంటాయి. ఉష్ణోగ్రత 20 డిగ్రీల సెంటీగ్రేట్ కంటే తగ్గితే, పెరుగుదల బాగా తక్కువగా ఉంటుందని అర్థం. పారదర్శకత 25-40 సెంటీమీటర్లు ఉండాలి. చేపలు, రొయ్యల పెరుగుదలను నిర్ధారించడానికి కరిగిన ఆక్సిజన్ 5 పీపీఎం అంతకంటే ఎక్కువ ఉంచాలి. పగటిపూట అధిక హెచ్చుతగ్గులు లేకుండా నీటి పీహెచ్ 7.5-8.5 మధ్య ఉండాలి. రైతులు అమ్మోనియా, నైట్రేట్, హైడ్రోజన్ సల్ఫాయిడ్ వంటి విష వాయువుల నుంచి కూడా జాగ్రత్త వహించాలి.

ఆక్వాసాగులో నేల పాత్ర ఇలా

చెరువు సాగులో ఒండ్రు, నల్లరేగడి నేలలు నీటి నిలుపుదల శక్తిని కలిగి ఉంటాయి. ఇవి సేంద్రియ పదార్థాల విచ్ఛిన్నతను నియంత్రిస్తాయి. పీహెచ్ (6.5-7.5) సమతుల్యంగా ఉంచితే మంచి నేలలుగా పరిగణించాలి. నేలలో కాల్షియం, కార్బోనేట్ 5 శాతం కంటే ఎక్కువగా ఉంటే మంచి సామర్థ్యం కలిగిన నేలలుగా భావించాలి. అల్యూమినియం, మాంగనీస్ వంటి విషవారిత లోహాలు నీటిలో కరిగిపోకుండా నేలలు నిరోధిస్తుంది. సేంద్రియ పదార్థం 2 శాతం కంటే ఎక్కువ ఉన్న నేలలు నీటి లీకేజీని తగ్గించి, సూక్ష్మజీవుల అభివృద్ధికి మద్దతు ఇస్తాయి. చౌడు నేలలు సేంద్రియ పదార్థం విచ్ఛిన్నాన్ని తగ్గించి, ప్లాంక్టాన్ పెరుగుదలను పరిమితం చేస్తాయి.

నేల, నీటి మధ్య రసాయనాల మార్పిడి

చెరువు అడుగున, నేల, నీరు నిరంతరం ఒకదానితో ఒకటి పరస్పర చర్యలకు గురవుతాయి. ఆమ్ల నేలలు చెరువు పీహెచ్‌ని తగ్గిస్తాయి. క్షార నేలలు కార్బోనేట్ నిక్షేపాలను పెంచుతాయి. నేలలు నత్రజని, భాస్వరం గిడ్డంగులుగా పనిచేస్తాయి. ప్లాంక్టన్ పెరుగుదలకు తోడ్పడటానికి లవణాలను క్రమంగా విడుదల చేస్తాయి. వృథా అయిన మేత, జంతువుల వ్యర్థాలు పేరుకుపోయినప్పుడు, ఆక్సిజన్ స్థాయిలు తగ్గి, అమ్మోనియా స్థాయిలు పెరుగుతాయి. బాగా ఆక్సిజన్ నిండిన నేలలు ఆరోగ్యకరమైన విచ్ఛేదనాన్ని ప్రోత్సహిస్తాయి. ఆక్సిజన్ తక్కువగా ఉన్న నేలలు హైడ్రోజన్ సల్ఫైడ్, మీథేన్ వంటి విష వాయువులను విడుదల చేస్తాయి.

చెరువు తయారీ నిర్వహణ ఇలా

- మట్టి, నీటి నాణ్యత సమతుల్యానికి చెరువు అడుగు భాగాన్ని ఎండబెట్టాలి.
- చెరువును ఎండబెట్టి దున్నడం వల్ల ఖనిజాలు స్థిరంగా ఉంటాయి.
- సున్నం చల్లడం వల్ల ఆమ్లత తటస్థంతో పాటు ఉపయోకర సూక్ష్మజీవుల పెరుగుదలకు సహాయపడుతుంది.
- అవాంఛిత చేపలను, జీవులను తొలగించడానికి సహజ చేపల నాశకాలైన సాయిల్ కేక్, టీ సీడ్ కేక్‌లు ఉపయోగించాలి.
- ఎరువులు, ప్లాంక్టాన్ పెరుగుదలను ప్రేరేపిస్తాయి. అధిక బ్లూమ్‌లను నివారించడానికి ఎరువులను జాగ్రత్తగా వాడాలి.



- ఆక్సిజన్ స్థాయిలను క్రమబద్ధీకరించడానికి, హానికరమైన పదార్థాలు పేరుకుపోకుండా ఉండటానికి బురద (స్లడ్జ్) తొలగింపు చాలా అవసరం.

పర్యావరణ సమతుల్యతకు మూలం



నేల, నీరు కలిసి చెరువు పర్యావరణ సమతుల్యతను నిర్ధారిస్తాయి. ఆక్వాసాగులో ఈ రెండు వీడదీయరాని బంధంగా ఉంటాయి. చేపల, రొయ్యల రైతులు నేల, నీరు, మేతలు వంటి వాటిపై సరైన అవగాహనతో ఉండాలి. నీటి, మట్టి పరీక్షలను ఆక్వా ల్యాబ్‌లో పరీక్షలు చేయించుకోవాలి. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా సాగు పద్ధతులను పాటించాలి. సమస్య గుర్తిస్తే ఆక్వా నిపుణులను సంప్రదించాలి.

– డాక్టర్ పి.రామమోహన్‌రావు, విశ్రాంత డిప్యూటి డైరెక్టర్ ఆఫ్ ఫిషరీస్, కాకినాడ

బాలికపై దాడికి యత్నించిన వీధి శునకాలు


పరిగెట్టుకుంటూ వచ్చి తల్లిని పట్టుకున్న బాలిక కాషిక

ద్వారకాతిరుమల : వీధి కుక్కలు ప్రజలను హడలెత్తిస్తున్నాయి. చిన్న పిల్లలపై తరచూ ఎక్కడో ఒకచోట దాడులు చేస్తూనే ఉన్నాయి. ఈ క్రమంలో ద్వారకాతిరుమలలోని రాణీ చిన్నయమ్మారావు పేటలో గురువారం రెండు వీధి కుక్కలు ఒక బాలికపై దాడికి ప్రయత్నించాయి. అయితే వాటి బారి నుంచి తప్పించుకుని ఆ బాలిక ప్రమాదం నుంచి బయటపడింది. వివరాల ప్రకారం స్థానికంగా నివాసం ఉంటున్న భార్గవి తన పాప కాషికను ఉదయం పాఠశాలకని ఇంటి నుంచి పంపింది. కాషిక నడుచుకుంటూ కాస్త దూరం వెళ్లగానే రెండు వీధి కుక్కలు అరుచుకుంటూ కాషిక మీదకు వచ్చాయి. ప్రమాదాన్ని గమనించిన కాషిక పెద్దగా అరుస్తూ తన ఇంటి వైపునకు పరుగులు తీసింది. ఆ అరుపులు విన్న భార్గవి కంగారుగా రోడ్డు మీదకు వచ్చింది. వెంటనే కాషిక పరిగెట్టుకుంటూ వచ్చి తల్లిని పట్టుకుంది. వణికిపోతున్న పాపను దగ్గరకు తీసుకోగా, ఆ శునకాలు వెనక్కి వెళ్లిపోయాయి. ఇది చూసిన స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. పాప శునకాలకు చిక్కితే పెనుప్రమాదం జరిగేదని, రోడ్డు మీదకు రావాలంటేనే భయమేస్తోందని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, వీధి కుక్కల బెడదను తొలగించాలని కోరుతున్నారు.

పెరిగిన వర్జీనియా పొగాకు ధర

కేజీకి రూ.395 రికార్డు ధర


వేలం కేంద్రానికి వచ్చిన వర్జీనియా పొగాకు బేళ్లు

జంగారెడ్డిగూడెం: చాలా రోజులు స్థిరంగా కొనసాగిన వర్జీనియా పొగాకు ధర ఈ నెల ప్రారంభం నుంచి పెరుగుతూ వచ్చింది. ఇలా పెరుగుతూ వచ్చిన ధర గురువారం కేజీ ధర రూ. 395కు చేరుకుంది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో జంగారెడ్డిగూడెం-1, -2, కొయ్యలగూడెం, గోపాలపురం, దేవరపల్లిలో వర్జీనియా పొగాకు వేలం కేంద్రాలు ఉన్నాయి. ఈ ఏడాది వర్జీనియా వేలం ప్రారంభం సమయంలో కేజీకి రూ.290 మాత్రమే లభించింది. గత ఏడాది అత్యధికంగా కేజీకి రూ.411 లభించగా, కేజీ సరాసరి ధర రూ.330 లభించింది. ఈ ఏడాది వర్జీనియా వేలం ప్రారంభం నాడు రూ.290 ధర రాగా, క్రమేపీ పెరుగుతూ జూలై నెల చివరి వరకు కేజీ ధర అత్యధికంగా రూ.390 లభించింది. కేజీ ధర అత్యల్పంగా రూ.200 లభించింది. ఆ తరువాత జూలై 26 నుంచి ఆగస్టు మొదటి వారం వరకు అత్యధిక ధర రూ.20 పడిపోయి రూ.370 లభించింది. అత్యల్ప ధర రూ.200 లభించింది. ఆ తరువాత ఆగస్టు 9 నుంచి సెప్టెంబర్ 2 వరకు ఈ ధర మరింత పడిపోయి అత్యధిక ధర కేజీ రూ.350, అత్యల్పధర రూ. 200 లభించింది. దీంతో రైతులు తీవ్ర నిరాశకు గురయ్యారు. కేజీ ధర రూ.390 నుంచి రూ. 350కు పడిపోవడంతో రైతుల్లో ఆందోళన మొదలైంది. ఆయా కంపెనీలు సిండికేట్‌గా మారి పొగాకు ధరను తగ్గించి కొంటున్నారని రైతులు ఆరోపించారు. రూ.390 నుంచి రూ.350కు పడిపోయిన ధర సుమారు 25 రోజుల పాటు రూ.350 వద్ద స్థిరంగా కొనసాగింది. సెప్టెంబర్ 3న కొద్దిగా పెరిగి కేజీ ధర రూ.362, 4న రూ.375, 6 నుంచి 8 వరకు రూ.376 లభించింది. 9, 10వ తేదీన ఈ ధర మరింతగా పెరిగి రూ.390కు చేరుకుంది. గురువారం ధర రూ. కేజీ ఒక్కింటికి రూ.395 రాగా, అత్యల్పం రూ. 200 లభించింది. కాగా గురువారం నాటి వేలంలో జంగారెడ్డిగూడెం -1, 2 వేలం కేంద్రాలు, కొయ్యలగూడెం, గోపాలపురం వేలం కేంద్రాల్లో అత్యధిక ధర కేజీ ఒక్కింటికి రూ. 395 లభించగా, గోపాలపురం వేలం కేంద్రంలో రూ.394 లభించింది. అలాగే గురువారం నాటికి సరాసరి ధర రూ. 296.34 లభించింది.

వరిని ఆశించే పురుగులతో ఇక్కట్లు


కాండం తొలుచు పురుగుతో దెబ్బతిన్న వరిపైరు


వరిని ఆశించే ఆడ, మగ కాండం తొలుచు పురుగులు

మండవల్లి: కాండం తొలుచు పురుగు, ఆకునల్లి తదితర రకాల పురుగుల వల్ల వరి రైతులు తీరని ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాండం తొలుచు పురుగు వరి పంటలో కనిపించే అతి ముఖ్యమైన పురుగు. ఇది ఖరీఫ్ రబీల్లో కూడా కనిపిస్తూ ఎక్కువ నష్టాని కలుగజేస్తుంది. ఇది ఒకే పంటను ఆశించి ఎక్కువ నష్టాన్ని కలుగజేస్తాయి. ఈ పురుగులు లైంగిక గుడ్డు నుంచి వచ్చే చిన్న పురుగులు కొన్ని గంటల పాటు ఆకులపై తిరుగుతూ చద్విరూకత కలిగి ఉంటాయి. ఆడ పురుగులు, మగ పురుగులు కొన్ని గుర్తింపు చిహ్నాల ద్వారా లింగ భేదం చేయవచ్చు, ఆడ పురుగు మగ పురుగుకన్నా పెద్దగా లావుగా ఉండి , లేత పసుపు రంగులో ఉంటుంది. ఆడ పురుగు మొదటి జత రెక్కల పైన మధ్యలో ఒక నల్లటి చుక్క ఉంటుంది. మగ పురుగు ముందు రెక్కలపై నల్లటి మచ్చ ఉండదు.

వరికాండానికి పెద్ద దెబ్బ

ఈ పురుగులు గుడ్డు నుంచి వచ్చే చిన్న పురుగులు కొన్ని గంటల పాటు ఆకులపై తిరుగుతూ ఊలు దారంతో వేలాడుతాయి. ఇవి ఆకుల తొడిమి లోకి ప్రవేశించి కాండంను తింటూ లోపలకు చేరి లోపలి భాగాన్ని తింటాయి. ఈ పురుగు వరిపైరును పిలకలు వేసే దశ, చిరుపొట్ట దశల్లో ఆశించి నష్టాన్ని కలుగజేస్తాయి. ఈ పురుగులు పైరును వరి పంటను పిలకలు వేసే దశలో ఆశించి నష్టాన్ని కలుగజేస్తాయి. క్లోరో నియంత్రప్రోల్ మందు ఎకరానికి 60 మి.లీ, కార్ట్ ఆఫ్ హైడ్రోక్లోరైడ్ మందు 2 గ్రాములు ఒక లీటరు నీటికి అసిఫెట్ ఒక గ్రాము లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

కాండం తొలుచు పురుగుతో ఎంతో నష్టం



కాండం తొలుచు పురుగు వరిపైరును పిలకలు వేసేదశ, చిరుపొట్ట దశల్లో ఆశించి నష్టాన్ని కలుగజేస్తాయి. వ్యవసాయాధికారుల సూచనలతో దీనిని నివారించుకోవచ్చు.

– నల్లమోతు వేణుగోపాలరావు, మండవల్లి

ఆకుల తొడిమిలో ప్రవేశించి నష్టం కలిగిస్తాయి



ఇవి ఆకుల తొడిమిలోకి ప్రవేశించి కాండంను తింటూ లోపలికి చేరి లోపలి భాగాన్ని తింటాయి. దీంతో వరిపైరుకు బాగా నష్టం ఏర్పడుతుంది.

– పందిళ్ళ సూర్యనారాయణ, మండవల్లి

సోదరుడిని చూసేందుకు వస్తూ అనంత లోకాలకు..


సూర్యనారాయణ మృతదేహం

ఏలూరు టౌన్: స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలో ఒక వ్యక్తి రైలు నుంచి జారిపడి సంఘటనా స్థలంలోనే మృతిచెందాడు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కాకినాడ నగరానికి చెందిన కోటి సూర్యనారాయణ (80)కు ఏలూరులో వరుసగా సోదరుడైన ఒక వ్యక్తి మృతిచెందాడు. ఆయనను చూసేందుకు సూర్యనారాయణ కాకినాడ నుంచి గురువారం ఉదయం ఏలూరుకు రైలులో బయలుదేరాడు. రైలు ఏలూరు శివారు ఆశ్రం హాస్పిటల్ సమీపంలోకి వచ్చేసరికి అతను ప్రమాదవశాత్తు రైలు నుంచి జారిపడి సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు. రైల్వే పోలీసులు మృతదేహాన్ని ఏలూరు జీజీహెచ్ మార్చురీకి తరలించారు. రైల్వే పోలీస్‌స్టేషన్ హెచ్‌సీ ప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆక్వా సాగులో మెలకువలతో లాభాలు


ఆక్వా ఎక్స్‌లో కొత్త ప్రొడెక్ట్‌ను ప్రారంభిస్తున్న కేంద్రమంత్రి శ్రీనివాసవర్మ

కాళ్ల: ఆక్వా సాగులోని మెలకువులతో రైతులు లాభసాటిగా ముందుకు సాగాలని కేంద్ర సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాసవర్మ, రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. పెదఅమిరంలోని ఆర్ కన్వెన్షన్ హాల్లో మూడురోజులపాటు నిర్వహించే ఆక్వా ఎక్స్ ఇండియాను గురువారం వారు ప్రారంభించారు. ఆక్వా ఎక్స్‌పోలను రొయ్య, చేపల రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. నిర్వాహకులు దంతులూరి వేణు మాట్లాడుతూ 9 ఏళ్లుగా అనేక చోట్ల ఆక్వా ఎక్స్ ఇండియా ఆధ్వర్యంలో ఆక్వా ఎక్స్‌పో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, 100 స్టాల్స్‌తో ప్రదర్శన జరుగుతుందన్నారు. మొదటి రోజు జరిగిన ఈ కార్యక్రమంలో దాదాపు 3000 మంది రైతులు పాల్గొని వివిధ ఆక్వా కంపెనీలు ఏర్పాటు చేసిన 80 స్టాల్స్ ను సందర్శించి వాళ్లకి కావాల్సిన సమాచారం, ప్రొడెక్షన్ గురించి తెలుసుకున్నారన్నారు. అలాగే మిగిలిన రెండు రోజులలో జరిగే కార్యక్రమానికి దాదాపు 6000 మంది పైగా వివిధ కంపెనీ ల ప్రతినిధులు, రైతులు, ప్రజలు పాల్గొంటారని చెప్పారు. కార్యక్రమంలోఆక్వా ఎక్స్‌పో టైటిల్ పార్టనర్ నెక్సజెన్ కంపెనీ నుంచి అక్కిన శేషు, సీఓఓ టి. శ్రీనివాస్, సూర్యమిత్ర ఎగ్జిమ్ ప్రైవేట్ లిమిటెడ్ అధినేత యిర్రింకి సూర్యారావు, పొత్తూరి బాపిరాజు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

బండివారిగూడెం వద్ద లారీ బోల్తా




టి.నరసాపురం: మండలంలోని బండివారిగూడెం సమీపంలో జామాయిల్ పుల్ల లోడు లారీ బోల్తాపడింది. వివరాల ప్రకారం చింతలపూడి మండలం యర్రగుంటపల్లికి చెందిన లారీ జామాయిల్ పుల్లల లోడుతో చింతలపూడి నుంచి రాజమండ్రి పేపర్ మిల్లుకు వెళుతోంది. బండివారిగూడెం సమీపంలో రోడ్డుపై ఉన్న గుంతలో పడి అదుపు తప్పి పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టి బోల్తాకొట్టింది. ఈ ప్రమాదం నుంచి లారీ డ్రైవర్, క్లీనర్‌లు సురక్షితంగా బయటపడ్డారు. అయితే లారీ బోల్తా పడటంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది.

14న జిల్లా జూనియర్ కబడ్డీ జట్ల ఎంపిక

తణుకు అర్బన్: రాష్ట్ర స్థాయిలో నిర్వహించనున్న అంతర్ జిల్లాల జూనియర్ కబడ్డీ పోటీల్లో పాల్గొనబోయే జిల్లా బాలురు, బాలికల కబడ్డీ జట్ల ఎంపిక ఈ నెల 14న నిర్వహించనున్నట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ సెక్రటరీ వై.శ్రీకాంత్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. పెద తాడేపల్లిలోని శ్రీవాసవి ఇంజనీరింగ్ కళాశాలలో మధ్యాహ్నం 2 గంటలకు ఎంపికలు ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. ఈ ఎంపిక పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు 2006 జనవరి 1వ తేదీ తరువాత జన్మించిన వారై ఉండాలని, 75 కేజీలు లోపు బాలురు, 65 కేజీలు లోపు బాలికలు బరువు కలిగి ఉండాలని స్పష్టం చేశారు. జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు సెప్టెంబర్ 22 నుంచి 24 వరకు విజయవాడ గొల్లపూడిలో నిర్వహించే అంతర్ జిల్లాల జూనియర్ కబడ్డీ పోటీలో పాల్గొంటారని వివరించారు. ఇతర వివరాలకు 94913 33906, 96424 96117 నంబర్లకు ఫోన్ చేయాలని కోరారు.

ఉత్సాహంగా స్కూల్ గేమ్స్ ఎంపిక పోటీలు


స్కూల్ గేమ్స్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

భీమవరం : స్థానిక బ్రౌనింగ్ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో గురువారం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా 69వ స్కూల్ గేమ్స్ అండర్ 19 బాల, బాలికల నెట్ బాల్, మాల్కంబ్ క్రీడల్లో ఎంపికలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అండర్-19 స్కూల్ గేమ్స్ సెక్రటరీ కె.జయరాజు మాట్లాడుతూ 100 మంది క్రీడాకారులు ఎంపికలో పాల్గొన్నారన్నారు. ఎంపికైన క్రీడాకారులు త్వరలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా జట్లకు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. ఈ ఎంపిక కార్యక్రమానికి వీరవాసరం ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఫిజికల్ డైరెక్టర్ నాగమణి, బ్రౌనింగ్ కళాశాల పీడీ దావుద్ ఖాన్, పీడీలు శ్రీనివాస్, జీపీసీ శేఖర్ రాజు తదితరులు సహకరించారు. అనంతరం ఎంపికైన క్రీడాకారులను బ్రౌనింగ్ కళాశాల చైర్మన్ మేడిది జాన్సన్, సెక్రటరీ మేడిది ఎస్తేరుప్రియాంక, అభినందించారు.

రేపు ఇన్విటేషన్ చెస్ పోటీలు

భీమవరం: జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం భీమవరం పట్టణంలోని ఆర్యవైశ్య యువజన భవనంలో అనసూయ చెస్ అకాడమీ ఇన్విటేషన్ చెస్ పోటీలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మాదాసు కిషోర్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. అండర్-7,9,11,13,13 విభాగాల్లో బాల, బాలికలకు నిర్వహించే పోటీల్లో మొదటి, రెండో స్థానంలో విజేతలకు రూ. 20 వేలు నగదు బహుమతులు అందజేయనున్నట్లు చెప్పారు. ఇతర వివరాల కోసం 90632 24466 నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు.

2003 డీఎస్సీ ఉపాధ్యాయుల నిరసన


తహసీల్దార్ గాయత్రికి వినతిపత్రం సమర్పిస్తున్న 2003 డీఎస్సీ ఉపాధ్యాయుల ఫోరమ్ నాయకులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): 2003-డీఎస్సీ ఉపాధ్యాయులకు కేంద్ర ప్రభుత్వ మెమో 57 ప్రకారం పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని 2003 డీఎస్సీ ఫోరమ్ నాయకులు డిమాండ్ చేశారు. ఫోరం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గురువారం స్థానిక ఏలూరు అర్బన్ తహసీల్దార్ కార్యాలయం వద్ద నల్లబ్యాడ్జీలతో నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా ఫోరమ్ నాయకులు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సీపీఎస్ విధానం అమలు 2004 సెప్టెంబర్ 1కు ముందు నోటిఫికేషన్ వెలువడినప్పటికీ, నియామకాలు తర్వాత జరిగిన కారణంగా సుమారు 11,000 మంది ఉద్యోగులు, ఉపాధ్యాయులు పాత పెన్షన్ నష్టపోయారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ మెమో 57 ప్రకారం వీరందరికీ పాత పింఛన్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ఏలూరు తహసీల్దార్ గాయత్రికి వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఇప్పిలి శంకర్ రావు, నండూరి గణేష్, మరక బాలసుబ్రహ్మణ్యం, ఎం. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

కైకలూరు: మద్యానికి బానిసైన వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. కైకలూరు రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కైకలూరు మండలం జంగంపాడు గ్రామానికి చెందిన కొప్పనాతి నాగూల్ మీరా (34) వలల పనులతో పాటు వంట పనులు చేస్తాడు. ఇతను మద్యానికి అలవాటుపడ్డాడు. దీంతో తరుచూ కుటుంబ సభ్యులతో గొడవలు పడుతున్నాడు. ఇతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మద్యం సేవించిన మత్తులో బుధవారం రాత్రి ఉరివేసుకుని మృతి చెందాడు. భార్య వరలక్ష్మీ ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్సై వి.రాంబాబు గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తోన్నారు.

క్లుప్తంగా

రక్షణ చట్టాలపై అవగాహన



బల్లిపాడు ప్రాథమిక పాఠశాలలో మాట్లాడుతున్న సూపర్‌వైజర్ ఎం శ్రీదేవి

అత్తిలి: మిషన్ శక్తి కార్యక్రమంలో భాగంగా గురువారం అత్తిలి మండలం బల్లిపాడు ప్రాథమిక పాఠశాలలో బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమాన్ని ఐసీడీఎస్ పర్యవేక్షకురాలు ఎం శ్రీదేవి ఆధ్వర్యంలో నిర్వహించారు. గుడ్ టచ్ బ్యాడ్ టచ్ పై విద్యార్థినిలకు అవగాహన కల్పించారు. పనిప్రదేశంలో వేధింపులకు గురిచేస్తే శిక్షలు ఉంటాయని తెలిపారు. న్యూట్రిషన్ ఆహారం గురించి తెలిపారు. ప్రధానోపాధ్యాయిని ఏ. పద్మ, ఉపాధ్యాయుడు సీహెచ్‌వి. వెంకట్రావు, అంగన్‌వాడీ కార్యకర్తలు డి. నర్సవేణి, శివసత్యవతి, నిర్మల కుమారి, రామలలిత పాల్గొన్నారు.

నేడు ఆర్‌ఎస్‌కేల వద్ద సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల వద్ద శుక్రవారం ఉదయం 8 గంటలకు సామూహిక ఎలుకల ఎర కార్యక్రమం చేపట్టనున్నట్లు మండల వ్యవసాయాధికారి నారాయణరావు తెలిపారు. గురువారం ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఎలుకల నిర్మూలనకు ప్రభుత్వం బ్రోమోడయోలిన్ మందును ఉచితంగా పంపిణీ చేస్తుందన్నారు. ఎలుకల ఎర తయారీకి అవసరమైన నూకలు, నూనెను రైతుల ద్వారా ఏర్పాటు చేస్తామన్నారు. రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని, సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

అత్తిలిలో సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమం

అత్తిలి: మండలంలోని అన్ని గ్రామాల్లో శుక్రవారం సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండల వ్యవసాయధికారి టికే రాజేష్ తెలిపారు. కార్యక్రమంలో భాగంగా రైతులందరికీ మందు కలిపిన విషపు ఎరను పంపిణీ చేస్తామన్నారు. రైతులందరూ వ్యవసాయ శాఖ ద్వారా చేపట్టే ఈ సామూహిక ఎలుక నిర్మూలన కార్యక్రమం ద్వారా పంపిణీ చేయబడిన విషపు ఎరను ఎలుక బొరియల వద్ద పెట్టాలని కోరారు. రైతులందరూ సామూహికంగా ఈ విధంగా చేస్తే సమర్థవంతంగా ఎలుకలను నిర్మూలించవచ్చన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు రక్తదాన శిబిరం

తణుకు అర్బన్: రిజిస్ట్రేషన్, స్టాంపుల శాఖ జిల్లా రిజిస్ట్రారు ఆధ్వర్యంలో శుక్రవారం తణుకులోని ఇండియన్ రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంకులో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు తణుకు సబ్ రిజిస్ట్రారు డి.రాధాబాయి తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించే ఈ శిబిరంలో తణుకు, పెంటపాడు, తాడేపల్లిగూడెం, పెనుగొండ, అత్తిలి, సజ్జాపురం, ఆచంట, పాలకొల్లు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల అధికారులు, సిబ్బంది పాల్గొంటారని వివరించారు. ఈ శిబిరంలో స్వచ్ఛందంగా రక్తదానం చేసే రక్తదాతలు పాల్గొనాలని ఆమె కోరారు.

దేవస్థానం ధర్మకర్తల మండలి నియామకానికి నోటిఫికేషన్ విడుదల

అత్తిలి: బల్లిపాడు గ్రామంలో రుక్మిణీ సత్యభామా సమేత మదనగోపాలస్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి నియామకానికి ధార్మిక పరిషత్, రాష్ట్ర ప్రభుత్వం నుంచి నోటిఫికేషన్ వెలువడిందని ఆలయ కార్యనిర్వహణాధికారి ఎల్ లోకనాథ్ శ్రీనివాసరావు గురువారం ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగలవారు ధర్మకర్త పదవి కోసం 20 రోజులలో దరఖాస్తు చేసుకోవాలని ఈవో కోరారు.

ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి



నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయిలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలు కావస్తున్న రాష్ట్ర ప్రభుత్వ, ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంలో తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తుందని, ఈ విధానాలను వ్యతిరేకిస్తూ ఏపీటీఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గురువారం నిరసన వారం నిర్వహించారు. ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. ఏపీటీఎఫ్ పట్టణ అధ్యక్షులు రమేష్ బాబు, ప్రధాన కార్యదర్శి నాగరాజులు మాట్లాడుతూ ప్రభుత్వం సమస్యలను పరిష్కరించకపోతే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని వెల్లడించారు.

కుస్తీ పోటీలకు గురుకుల విద్యార్థులు

నరసాపురం రూరల్: రాష్ట్ర స్థాయి కుస్తీ పోటీలకు నరసాపురం మండలం ఎల్బీచర్ల ఎస్సీ గురుకుల పాఠశాల విద్యార్థులు ఇద్దరు ఎంపికయ్యారు. గురువారం ఏలూరు జిల్లా పెదవేగిలో జరిగిన జిల్లా స్థాయి కుస్తీ పోటీల్లో పాల్గొని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎం గోపీచంద్, వై మహిమారాజులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఎం శ్యాంప్రసాద్‌లు తెలిపారు.



హౌసింగ్‌బోర్డులో శిథిలమైన భవనాల వద్ద అపరిశుభ్ర పరిస్థితులు



హౌసింగ్ బోర్డు కాలనీ ఎల్‌ఐజీలో అపరిశుభ్రంగా ఉన్న ఖాళీ స్థలం



ఎల్‌ఐజీలో పిచ్చిమొక్కలతో అస్తవ్యస్తంగా ఉన్న పార్కు

గూడెంలో పడకేసిన పారిశుద్ధ్యం

- అస్తవ్యస్తంగా హౌసింగ్ బోర్డు ఎల్‌ఐజీ
- దోమల బెడదతో అల్లాడుతున్న ప్రజలు
- రోగాల బారిన ప్రజలు
- నివారణా చర్యలు చేపట్టని మున్సిపల్ అధికారులు

పట్టణంలో పారిశుద్ధ్యం పడకేసింది. ఫలితంగా పలు వార్డుల్లో రోగాలు విజృంభిస్తున్నాయి. జ్వరపీడితులతో ఆస్పత్రులు నిండిపోతున్నాయి. అయినా మున్సిపల్ అధికారులకు పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలనే ధ్యాసే లేదు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో పరిసరాలను శుభ్రం చేయించడం, దోమలు నివారణకు ఫాగింగ్ చేయించడం తదితర పారిశుద్ధ్య చర్యలకు మున్సిపల్ అధికారులు తిలోదకాలిచ్చారు.

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీ 34, 35 రెండు వార్డుల్లో పారిశుద్ధ్యం పడకేసింది. స్థానిక ఎల్‌ఐజీ పరిసరాలను పరిశీలించగా ఆయా ప్రాంతాలు అధ్వానంగా ఉన్నాయి. అస్తవ్యస్తంగా ఉన్న పరిసరాలతో ప్రజలు ఇక్కట్లు పడుతున్నారు. ఈ వార్డులో చాలా రహదారులు మట్టి, కంకర రోడ్లుగా దర్శనం ఇస్తున్నాయి. రహదారులు ఎత్తు పల్లాలతో నడిచేందుకు కూడా స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అక్కడక్కడ సీసీ రోడ్లు ఉన్నాయి. సీసీ రోడ్లు ఉన్న చోట డ్రెయినేజీ వ్యవస్థ కొంత మేర ఉన్నప్పటికి చాలా ప్రాంతాల్లో డ్రెయినేజీలు లేవు. డ్రెయినేజీలు ఉన్నచోట్లు డ్రెయిన్‌లు ఎండిపోవడంతో పాటు అనేక ప్రాంతాల్లో ముందుకు కదలని మురుగు డ్రెయిన్‌లు కానవస్తున్నాయి. స్థానికులు ఆయా సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.

ఖాళీ స్థలాలు అస్తవ్యస్తం:
ఆయా ప్రాంతంలో ఉన్న ఖాళీ స్థలాలు తుప్పలతో, చెత్త చెదారాలతో, వ్యర్థాలతో అస్తవ్యస్తంగా ఉంటున్నాయి. చాలా ప్రాంతాలలో వివిధ పిచ్చిమొక్కలతో పాటు పొదలు ఏర్పడటంతో వాటిని పరిశుభ్రం చేసే పరిస్థితులు కానరావడం లేదు. స్థలాలు మురుగు కూపాలు మాదిరిగా దర్శనం ఇస్తున్నాయి. ఖాళీ స్థలాలను పరిశుభ్రం చేయాలని కోరుతున్నారు.

ఎక్కడ చెత్త అక్కడే..
హౌసింగ్‌బోర్డు కాలనీలో ఎక్కడ చెత్త అక్కడే ఉంటుంది. పురపాలక సంఘం పారిశుద్ధ్య సిబ్బంది వచ్చినా పరిస్థితులు మారడం లేదని వాపోతున్నారు. డ్రెయినేజీ వ్యవస్థ దుర్వాసన వెదజల్లుతున్నాయి.

తాగునీటి సమస్య:
హౌసింగ్‌బోర్డు పలు ప్రాంతాలలో పాత పైపులైన్ వ్యవస్థ కారణంగా తాగునీటి సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. అనేక చోట్లు అమృత పథకంలో పైపులైన్లు వేసినప్పటికి పాత పైపులైన్‌లకు కలిపారు. దీంతో మురుగు నీరు వస్తుందని అక్కడ ప్రజలు వాపోతున్నారు తక్షణమే కుళాయి సమస్యలను, తాగునీటి సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.

స్లమ్ ఏరియాలుగా ఎల్‌ఐజీ:
ఎల్‌ఐజీ -1, 2 లలో లోతట్టు ప్రాంతాలు ఉండటం, డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో ఎవరికి వారు తమ ఇళ్ల వద్దే ఇంకుడు గుంటలను ఏర్పాటు చేయడంతో ఎక్కడ మురుగునీరు అక్కడే ఉంటుంది. దోమల బెడద అధికంగా ఉందని అంటున్నారు. దోమలు సాయంత్రం నుంచి కూర్చనివ్వడం లేదని, రాత్రి సమయాలలో నిద్రకు దూరం అవుతున్నామని, తరుచుగా వ్యాధుల భారీన పడుతున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎల్‌ఐజీలో శిథిలమైన డాబాలు చాలా వరకు కన్పిస్తున్నాయి. అపారిశుద్ధ్యం, ఇళ్ల చుట్టూ తూడు, తుప్పలతో నిండి ఉన్నాయి. పాముల బెడద అధికంగా ఉంది. పట్టించుకోవాలని కోరుతున్నారు. ఈ విషయంపై మున్సిపల్ అధికారులను వివరణ కోరగా హౌసింగ్ బోర్డు ప్రాంతంలో అపరిశుభ్ర పరిస్థితులు తొలగించేందుకు కృషి చేస్తున్నాం.దోమల నివారణ చేసేందుకు స్ప్రేయింగ్, ఫాగింగ్‌లు చేస్తున్నాం. చెత్తచెదారాలను ఎప్పటికప్పుడు తరలిస్తున్నామని అధికారులు తెలిపారు.



ఇంటి వద్ద చెత్తా చెదారాలు, అపరిశుభ్ర పరిస్థితులు





అస్తవ్యస్తంగా ఉన్న కచ్చా డ్రెయిన్‌లు

“ హౌసింగ్ బోర్డును అభివృద్ధి చేయాలి



హౌసింగ్‌బోర్డును 39 సంవత్సరాలు క్రితం ఏర్పాటు చేశారు. నాటి నుంచి నేటి వరకు ఎక్కడ సమస్యలు అక్కడే ఉన్నాయి. ముఖ్యంగా నీటి సమస్యలను తొలగించాలి. రహదారులును అభివృద్ధి చేయాలి. డ్రెయిన్లు కట్టాలి. అపారిశుద్ధ్య పరిస్థితలను తొలగించాలి. దోమల నివారణకు చర్యలు చేపట్టాలి. స్థానిక ప్రజలను ఆదుకోవాలి.

-జి.ధనలక్ష్మి, హౌసింగ్‌బోర్డు స్థానికురాలు

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ దారుణం



పొట్ల సురేష్, న్యాయవాది

తణుకు అర్బన్: రాష్ట్రంలో మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేస్తూ కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు, న్యాయవాది పొట్ల సురేష్ ఖండించారు. ఈ నిర్ణయంతో ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారీలు వైద్యులు కావాలనే కోరిక కలగా మిగిలిపోతుందన్నారు. చంద్రబాబు తీసుకున్న నిర్ణయం చాలా దారుణమని అదేవిధంగా క్యాబినెట్లో మంత్రి నారాయణకు మెడికల్ కాలేజ్ కటపెట్టాలనే ఆలోచనలో ఉన్నారని విమర్శించారు. భారత రాజ్యాంగం కల్పించిన హక్కులని ఉల్లంఘించే విధంగా కూటమి ప్రభుత్వం తీరు ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. సామాన్యులు వైద్యులయ్యే అయ్యే పరిస్థితులు లేవని పేర్కొన్నారు. ఇదే విధానంలో కూటమి ప్రభుత్వం ఉంటే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం చేపడతామని అన్నారు.

విద్య లోతైన పుస్తకం



తణుకు రోటరీ క్లబ్‌లో సమావేశంలో మాట్లాడుతున్న డీవైఈవో సత్యనారాయణ

తణుకు అర్బన్: విద్య అనేది లోతైన పుస్తకమని, విద్యా నైపుణ్యాన్ని ప్రతి ఒక్కరూ ఎప్పటికీ పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందని డీవైఈవో దుడే మురళీ సత్యనారాయణ అన్నారు. తణుకు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన నూతన విద్యావిధానం – ఆవశ్యకత అనే అంశంపై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చదువు పూర్తైనది అనే మాట నేటి సమాజంలో వర్తించని విషయమన్నారు. విద్యకు సంబంధించి క్షేత్రస్థాయిలో లోతుగా అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందన్నారు. విద్య నైతిక విలువలు, సేవానిరతి ఇతరులకు అందించేదిగా ఉండాలని స్పష్టం చేశారు. అనంతరం రోటరీ సభ్యుడు ఆనందరం మస్తానరావును క్లబ్ అధ్యక్షుడు కలగర వెంకటకృష్ణ ఘనంగా సత్కరించారు. రోటరీ క్లబ్ కార్యదర్శి జి.సుధాకర్, ప్రగతి రాజా, అనపర్తి ప్రకాశరావు, బసవ రామకృష్ణ, వి.పార్వతి, మద్దింశెట్టి శివరామకృష్ణ, డాక్టర్ వి.వెంకటరాజు, డాక్టర్ అహ్మద్ హుస్సేన్, మంత్రిరావు బాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కారుమూరి ఆరోపణలకు కట్టుబడి ఉన్నాం



తణుకులో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న లీగల్‌సెల్ సభ్యుడు సాయిబాబారెడ్డి

తణుకు అర్బన్: మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే రాధాకృష్ణపై చేసిన అవినీతి ఆరోపణలకు కట్టుబడి ఉన్నారని, అన్ని ఆధారాలతోనే మాట్లాడారని వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ సభ్యుడు వెలగల సాయిబాబారెడ్డి అన్నారు. తణుకు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కారుమూరి చేసిన ఆరోపణలకు సంబంధించి మునిసిపల్ మాజీ చైర్మన్ డాక్టర్ దొమ్మేటి వెంకట సుధాకర్ చేసిన ఛాలెంజ్‌ను స్వీకరిస్తున్నామని అన్నారు. గతంలో మీకు సంబంధించిన పత్రికలో టీడీఆర్ బాండ్లు తదితర అంశాల్లో కారుమూరిపై మీరు రాయించిన అవాస్తవాలకు సంబంధించి ఆధారాలు చూపిస్తే తాము కూడా మావద్ద ఉన్న ఆధారాలు తీసుకువస్తామని, ఎక్కడ కలుద్దామో మీరే చెప్పాలంటూ సవాల్ విసిరారు. గత నాలుగున్నరేళ్లగా కారుమూరిపై అవినీతి ఆరోపణలు పెద్ద ఎత్తున చేశారని అందులో తణుకు నియోజకవర్గంలో సుమారుగా 400 ఎకరాలు పొలం కొన్నారని మీ పత్రికల్లో రాయించారని దానికి సంబంధించిన ఆధారాలు కూడా పట్టుకురావాలని కోరారు. కూటమి నాయకులు, కార్యకర్తలు మాజీ మంత్రి కారుమూరిపై సభ్యతలేకుండా దుర్భాషలాడుతున్నారని వారంతా సమాధానం చెప్పాల్సిన రోజులు వస్తాయని అన్నారు. మీ ప్రసార సాధానల్లో వచ్చిన కథనాల ఆధారంగానే కారుమూరి ఆధారాలు తెప్పించుకుని ఆరోపణలు చేశారని, అమరావతిలో సైతం మీ నాయకులు చేసిన భూదందాపై కూడా ప్రసార సాధనాల్లోనే వచ్చాయని గుర్తు చేశారు. ముఖ్యంగా మీ టీడీపీ కార్యాలయంలో క్రికెట్ బుకీలతో నిర్వహిస్తున్న సమావేశాలు మీ నాయకుల ద్వారానే బయటకు వచ్చాయని విమర్శించారు. గతంలో వైటీరాజా, చిట్టూరి బాపినీడు వంటి పెద్దలు శాసనసభ్యులుగా పరిపాలన అందించారని కానీ ఎన్నడూ క్రికెట్ బుకీలతో పార్టీ కార్యాలయాల్లో సమావేశాలు నిర్వహించిన సందర్భాలు లేవన్నారు. మీ వద్ద ఉన్న ఆధారాలు తీసుకువస్తే మా వద్ద ఉన్న ఆధారాలు కూడా మేము తీసుకువస్తామని చెప్పారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ తణుకు మండల మహిళాధ్యక్షురాలు ఉండవల్లి జానకి పాల్గొన్నారు.

12వ పీఆర్సీ కమిషన్‌ను నియమించాలి



కొమ్మర జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ఎస్టీయూ నాయకులు

అత్తిలి: రాష్ట్రంలో ఉన్న 11 లక్షల మంది ఉద్యోగ, ఉపాధ్యాయ కార్మిక పెన్షనర్లకు సంబంధించిన 12వ పీఆర్సీ కమిషన్‌ను వెంటనే నియమించి నిత్యావసర ధరలకు అనుగుణంగా 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సాయి వర్మ డిమాండ్ చేశారు. ఎస్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా గురువారం అత్తిలి మండలం కొమ్మర , కంచుమర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులతో జరిగిన సమావేశంలో ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సాయి వర్మ పాల్గొని మాట్లాడారు. సీపీఎస్, జీపీఎస్‌ను రద్దు చేసి, ఓపీఎస్‌ను వెంటనే అమలు చేయాలన్నారు. పెండింగ్ కరువు భత్యాల బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు. ఉద్యోగ ఉపాధ్యాయులు పదవీ విరమణ పొందుతున్న తరుణంలో కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన మెమో 57 ప్రకారం 2004 కన్నా ముందు నోటిఫికేషన్ విడుదలై పరిపాలన కారణాల వల్ల తర్వాత నియమితులైన ఉద్యోగులు, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. ఉమ్మడి సర్వీసు రూల్స్ సమస్యను పరిష్కరించి పాఠశాల సహాయకులకు జూనియర్ లెక్చరర్లుగా పదోన్నతులు కల్పించాలన్నారు. 1998, 2008 ఎంటీఎస్ ఉపాధ్యాయులకు 12 నెలలు పూర్తి జీతం చెల్లించి దశలవారిగా వారిని రెగ్యులర్ చేయాలన్నారు. ఈ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి దావీదు, ఎస్టీయూ జిల్లా కార్యదర్శి సీహెచ్‌వీవీఎస్ ప్రసాద్, ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి శివయ్య, ఎస్టీయూ జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు ఎంవీ సుబ్బరాజు, అత్తిలి మండల కార్యదర్శి సీహెచ్ జె ప్రసాద్ ఎస్టీయూ నాయకులు కొరు తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

కంటి సమస్యలపై నిర్లక్ష్యం వద్దు



ఆరుగొలను సొసైటీ వద్ద కళ్లజోళ్లు అందజేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: కంటి సమస్యల పట్ల నిర్లక్ష్యం వహించవద్దని ఆరుగొలను సొసైటీ చైర్మన్ ఉప్పలపాటి వీరవెంకటసత్యనారాయణ అన్నారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో గురువారం మండలంలోని ఆరుగొలను సొసైటీ వద్ద ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ కంటిలో ఏ చిన్నపాటి సమస్య వచ్చినా వెంటనే వైద్యుడిని సంప్రదించి చికిత్స పొందాలని, లేకుంటే కంటి చూపు కోల్పోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. అనంతరం 110మందికి కంటి పరీక్షలు చేయగా, పది మందికి ఆపరేషన్లు అవసరంగా గుర్తించి, నిడదవోలు ఆసుపత్రికి తరలించారు. మరో 40 మందికి సొసైటీ త్రిసభ్య కమిటి చైర్మన్ ఉప్పలపాటి వీరవెంకటసత్యనారాయణ సహకారంతో ఉచితంగా కళ్లజోళ్లు అందజేశారు. సొసైటీ మాజీ చైర్మన్ నూకల బుల్లియ్య, నీటి సంఘం అధ్యక్షుడు కురెళ్ల సత్యనారాయణ, రాజేష్, అడపా శ్రీనివాస్, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు జనపనేని రాజేంద్ర, ప్రతినిధులు పైడికొండల సింధు, యర్రా ఆంజనేయులు, చేకూరి బంగార్రాజు, కిషోర్ కుమార్, బంగార్రాజు, సొసైటీ కార్యదర్శి గోపిరెడ్డి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సూచనలు పాటిస్తే సాగు వ్యయం ఆదా

ఇరగవరం: రైతులకు సాగులో ఎలాంటి సందేహాలున్నా వ్యవసాయ సిబ్బంది దృష్టికి తీసుకెళ్లి వారి సూచనల మేరకు సస్యరక్షణ చర్యలు పాటిస్తే పెట్టుబడి వ్యయం తగ్గించుకోవచ్చని మండల వ్యవసాయాధికారి వై.రాఘవేంద్ర తెలిపారు. గురువారం ఇరగవరం మండలంలోని పేకేరు గ్రామంలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి రాఘవేంద్ర మాట్లాడుతూ వరిలో మోతాదుకు మించి పురుగు మందులు వాడొద్దని తెలిపారు. అవసరం మేరకే పురుగు మందులను వాడాలని రైతులకు సూచించారు. రైతులు ప్రస్తుతం కాండం తొలిచే పురుగుకు ఏ విధమైన చర్యలు తీసుకోవచ్చు అని అడుగగా, కాండం తొలుచు పురుగుకు ముందుగా నత్రజని అందించే ఎరువును మూడు దఫాలుగా వేసుకోవాలన్నారు. రైతు సేవా కేంద్రల వద్ద ఎలుకల మందు పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏలేటిపాడు వ్యవసాయ సహాయకులు డి శేషసాయి పాల్గొన్నారు.

విద్యార్థినులు బలమైన ఆహారాన్ని తీసుకోవాలి



డాక్టర్ రాజ్యలక్ష్మికి పుష్పగుచ్ఛం అందిస్తున్న విద్యార్థిని

తణుకు అర్బన్: తణుకు ఎస్‌కేఎస్‌డీ మహిళా కళాశాలలో గురువారం స్త్రీల సమస్యలు – తీసుకోవాల్సిన జాగ్రత్తలు అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఉమెన్ డెవలప్‌మెంట్ సెల్, జాతీయ సేవా పథకం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గైనకాలజిస్ట్ వైద్యురాలు డాక్టర్ రాజ్యలక్ష్మి మాట్లాడుతూ మహిళలకు రుతుక్రమ సమస్యలు, హార్మోన్స్ ప్రభావం వలన అనే సమస్యలు ఎదురవుతున్నాయని అన్నారు. ముఖ్యంగా పీసీఓడీ సమస్యలు మహిళల్లో 20 నుంచి 30 శాతం వరకు కనిపిస్తున్నట్లు చెప్పారు. పిట్యూటర్ గ్లాండ్ హార్మోన్ ప్రభావం విద్యార్థినులపై ఎక్కువగా బయటపడుతుందని, సమస్యలు పరిష్కరించుకునేందుకు విద్యార్థి దశ నుంచే పరిశుభ్రమైన తాగునీరు, తృణ ధాన్యాలు, పాలు వంటి ఆహార పదార్థాలు అధికంగా తీసుకోవాలని సూచించారు. స్వీట్స్, ఉప్పు కలిసిన పదార్థాలను తగ్గించుకోవాలని, రక్తహీనత రాకుండా బలమైన ఆహారాన్ని తీసుకోవాలని వివరించారు. ఈ కార్యక్రమంలో ఉమెన్ డెవలప్‌మెంట్ సెల్ కన్వీనర్ వి.తులసీరత్నం, ఎన్‌ఎస్‌ఎస్ ఆఫీసర్స్ సీహెచ్ రమేష్, కేవీ శ్యామలాదేవి, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఆటో కార్మికుల ధర్నాను జయప్రదం చేయాలి



కరపత్రాలు ఆవిష్కరణ

తాడేపల్లిగూడెం (టీఓసీ): విజయవాడలో ఆటో కార్మికుల ప్రదర్శన, ధర్నా ఈ నెల 18వ తేదీన నిర్వహిస్తున్నందున విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయూ నాయకులు మామిడి దాన వరప్రసాద్ కోరారు. ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కమిటీ కర పత్రాలు గురువారం పట్టణంలో ఆవిష్కరించారు. వక్తలు మాట్లాడుతూ ఆటో కార్మికులను ఆదుకుంటామని, జీవో నెంబర్ 21ని రద్దు చేస్తామని, ఆటో సంక్షేమ బోర్డును ఏర్పాటు చేస్తామని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చారని, 16 నెలలు కావస్తున్న ఇప్పటి వరకు ఆటో కార్మికుల సంక్షేమానికి ఏ విధమైన చర్యలు తీసుకోలేదని విమర్శించారు. ఉచిత బస్సులు కారణంగా ఆటో కార్మికులు అనేక ఇబ్బందులు పడుతున్నారని, వారికి తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. డ్రైవర్లు పడుతున్న కష్టాలు, డీజిల్, గ్యాస్ రేట్లు పెంపుదల, అధిక వడ్డీలకు అప్పులు చేసి, తీర్చకపోవడం తదితర విషయాలపై కార్యక్రమంలో చర్చించారు. అధిక సంఖ్యలో ఆటో డ్రైవర్లు పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి



కమీషనర్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని మున్సిపల్ కమిషనర్ ఏసుబాబు తెలిపారు. మునిసిపల్ కార్యాలయం కౌన్సిల్ హాల్‌లో మెడికల్ ఆఫీసర్లు, ఎంహెచ్‌ఓ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, వార్డు సానిటరీ, హెల్త్, తదితర సెక్రటరీలతో సీజనల్ వ్యాధులు, తాగునీరు కలుషితం తదితర సమస్యలు పరిష్కారం ఎలా చేయాలో అనే అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏసుబాబు మాట్లాడుతూ ఇంటింటికి ఫీవర్ సర్వేలు చేయాలన్నారు. వెక్టార్ యాప్‌లో పారిశుద్ధ్య ఫిర్యాదులను నమోదు చేయాలని సూచించారు. దోమల వ్యాప్తి జరగకుండా ప్రతి వార్డులోను ఫాగింగ్ తప్పకుండా చేయాలని, మురుగు నీటి గుంటలలో ఆయిల్ బాల్స్ వేయాలని, మురుగు కాలువలలో మురుగు నీరు పారేందుకు చూడాలని, వ్యాధులు ప్రబలకుండా ఇంటి పరిసరాలలో చేపట్టాల్సిన జాగ్రత్తలు తదితర విషయాలను అవగాహన చేశారు. ఈకార్యక్రమంలో ఎంఈ వై.వెంకట రమణ, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ ఎస్. రాజు, యూహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్స్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, డీఈఈలు, ఏఈలు, తదితరులు పాల్గొన్నారు.

సత్యసాయి సేవా సమితి సేవలు అభినందనీయం

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక డీఎస్ చెరువు వద్ద సత్యసాయి సేవా సమితి వారి ఆధ్వర్యంలో సత్యసాయి శత జయంతి ఉత్సవాలు సందర్భంగా గురువారం ఉచిత కంటి వైద్య శిబిరం జరిగింది. అనంతరం గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ ఎంఎన్ఎస్‌వి మురళీకృష్ణచే ఉచిత వైద్య సేవలు అందించారు. సుమారు 100 మందికి పైగా వైద్య పరీక్షలు జరిగాయి. ఉచిత మందులు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ ఎం.ఎన్.కే.ఎస్ జనార్ధనరావు , రాగు ఇంద్రేశ్వరావు, కె.మల్లిఖార్జునరావు, గౌరు సూర్యచంద్రరావు, పాలూరి రాంబాబు, సేవా దళ్ సభ్యులు సేవలు పాల్గొన్నారు.